# ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాం కు పటిష్ట భద్రత



**జిల్లా కలెక్టర్ హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను బద్రపరిచిన గోదాం కు పటిష్ట ఈ కల్పించడము జరుగుతుందని కలెక్టర్ హరిత అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రంలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాం ను నెలవారి తనిఖిలో భాగంగా సందర్శించి సి సి కెమెరాల పని తీరు, గేటుకు వేసిన సిలును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాం వద్ద పటిష్ట భద్రత కల్పించడం జరుగుతుందని 24 గంటల పాటు సి సి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం సుపరిండేంట్ జమిల్, నాయబ్ తహసిల్దార్ శ్యాంలాల్, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కేంద్ర మంత్రి హంసరాజ్ ను కలిసిన విశాల్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** మాజీ కేంద్ర మంత్రి హంస రాజ్ గంగారాం ఆహిర్ ని టీ ఏ సీ రాష్ట్ర సభ్యులు విశాల్ ఖండ్రె మహారాష్ట్రలోని చంద్ర పూర్‌లో ఉన్న మాజీ కేంద్ర మంత్రి నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన కు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుత రాజకీయ పరిణామాలు అభివృద్ధి పనులపై చర్చించారు. బిజెపి బలోపేతానికి విశేష కృషి చేస్తున్న హంసరాజ్ ఆహిర్ నాయకత్వాన్ని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈదులవాడ గణేష్, ముర్కుర్ రాజు, ఎల్కులే దిలీప్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



# అడవుల రక్షణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**డీఎఫ్ఓ బాలమణి**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** అడవుల సంరక్షణలో అటవీ శాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అంకిత భావంతో పనిచేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) బాలమణి సూచించారు. జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు యోగేష్ కులకర్ణి ఆధ్వర్యంలో సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, శాఖ పరంగా వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సద్దాం హుస్సేన్, సాయి చరణ్, స్వప్న, అనిల్ పాల్గొన్నారు.

# పీఏసీఎస్ చైర్మన్‌గా అలి బిన్ అహ్మద్ బాధ్యతల స్వీకరణ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రాథమిక సహకార సంఘాల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించిన నేపథ్యంలో ఆసిఫాబాద్ పీఏసీఎస్ చైర్మన్‌గా అలీ బిన్ అహ్మద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా, వారికి ఎరువులు, విత్తనాలు, రుణాలు సకాలంలో అందేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



# శాస్త్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వ్యవసాయ సాగులో శాస్త్రీయ పద్ధతులను అవలంభించడం ద్వారా అధిక దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూర్ మండల కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన రైతు వారోత్సవంలో పాల్గొన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత, తహశీల్దార్ మల్లి కార్జున్, మున్సిపల్ చైర్పర్సన్ పెద్దింటి పద్మలతో కలిసి వ్యవసాయ, ఉద్యాన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఒకే పంటపై ఆధార పడకుండా పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి వాణిజ్య పంటల సాగుపై దృష్టి పెట్టా లని, దీని ద్వారా భూసారం కాపాడడంతో పాటు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రారైస్కు డిమాండ్ ఉందని, సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తోందని పేర్కొన్నారు. రైతులు సన్న రకం వడ్ల సాగు వైపు మొగ్గు చూపాలని అన్నారు. ఆయిల్ పామ్ వంటి పంటల ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చని, తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. పంట సాగులో అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వినియోగించాలని, యూరియా, డీఏపీ వినియోగాన్ని నియంత్రించాలని చెప్పారు. రైతు వేదికల ద్వారా పంటలపై అవగాహన కల్పిస్తూనే, అధికారులు ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన కిట్ల ను పంపిణీ చేశారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, కేజీబీవీలో అదనపు గదులు, భోజనశాల నిర్మాణాలను పరిశీలించారు. అలాగే గిరిజన సంక్షేమ పాఠశాల, వసతి గృహాన్ని సందర్శించి సూచనలు చేశారు. సోమనపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను కూడా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.





# కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయం





**ఉద్యమ కెరటం, వరంగల్:** పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలకులు అమలు చేస్తున్న విధానాలకు కమ్యూనిస్టు, వామపక్ష సామాజిక శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయమని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పేర్కొన్నారు. వరంగల్లో ని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు వినాశనకర విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం మాత్రమే చేస్తోందని, రైతుల పరిస్థితి దారుణంగా మారిందని అన్నారు. పత్తి పంట దెబ్బతిని నష్టపోయిన రైతులు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న పండించినప్పటికీ కనీస మద్దతు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులు, దళారులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు. వెంటనే రైతు వేదికల వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాజకీయ పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పుగా మారాయని, వ్యక్తి స్వేచ్ఛ ప్రమాదంలో పడుతోందని తెలిపారు. సంపద కొందరికే కేంద్రీకృతమవుతోందని, ప్రశ్నించే స్వరాలను అణిచివేసే విధంగా చట్టాలు రూపొందుతున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు, వామపక్ష శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈనెల 12న నర్సంపేటలో జరిగే ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సభ వాల్పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనె కుమారస్వామి, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంసారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి నర ప్రతాప్, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేట అభివృద్ధికి డిప్యూటీ సీఎంకు వినతి

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం సర్పంచ్ మల్లుగారి పద్మ-నర్సాగౌడ్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి పలు కీలక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గ్రామం పెద్దదైనా అభివృద్ధిలో వెనుకబడి ఉందని, ప్రభుత్వ సహకారం అత్యవసరమని తెలిపారు. ఈ సందర్భంగా గంభీరావుపేట వాగుపై నాలుగు సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పెద్దమ్మ గుడి నుంచి లింగన్నపేట వరకు నాలుగు లైన్ల రహదారిని సెంట్రల్ లైటింగ్తో అభివృద్ధి చేయాలని, రోడ్డు విస్తరణలో నష్టపోయే వారికి తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయాలని, కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థుల కోసం మోడల్ హాస్టల్ భవనాలు మంజూరు చేయాలని కోరారు. మార్కెట్ సెంటర్తో పాటు ఎస్సీ, బీసీ, మైనారిటీ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, చారిత్రక ప్రాధాన్యం గల రామాలయాన్ని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. వెంకటాద్రి చెరువు, నవాబ్ చెరువులను అభివృద్ధి చేసి ట్యాంక్ బండ్లుగా మారిస్తే గ్రామానికి పర్యాటక ప్రాధాన్యం పెరుగుతుందని అన్నారు. లింక్ రోడ్ల అభివృద్ధి, కొత్త బస్ సర్వీసులు, బస్ షెల్ట ర్లనిర్మాణం ద్వారా రవాణా సదుపాయాలను మెరుగుపర్చాలని కోరారు. ఈ సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



# నిబంధనల ప్రకారం వరి ధాన్యం కొనుగోలు చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం వరి ధాన్యం కొనుగోలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం భీమారం మండలం పొలంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తూ రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. రైతులు నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు వంటి సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతుల వివరాలను సిస్టమ్లో నమోదు చేసి ఆధార్ ద్వారా గుర్తింపును ధృవీకరించాలని, భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను పరిశీలించాలని పేర్కొన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పరీక్షలు నిర్వహించాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యం





- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే పుష్పగుచ్ఛాలతో అతిథులను స్వాగతించారు. ఈ సందర్భంగా రూ.30.05 కోట్ల అంచనా వ్యయంతో సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లో 10 కొత్త 33/11 కేవీ సబ్స్టేషన్లకు శంకుస్థాపన చేసి, ఒక సబ్స్టేషన్ను ప్రారంభించారు. వీటి ద్వారా సుమారు 25,785 మంది వినియోగదారులకు లబ్ధి చేకూరనుందన్నారు. సమీక్షలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, లారీల కొరత ఉన్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూన్ 15లోపు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మరమ్మత్తులు పూర్తి చేసి తాగునీరు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ముందంజలో ఉన్న జిల్లా అధికారులను అభినందించారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా రేషన్ కార్డులు, 52లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లి స్తున్నామని, పెండింగ్ బిల్లులు కూడా చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తమ ప్రసంగాల్లో జిల్లా అభివృద్ధి, రైతు సంక్షేమం, పరిశ్రమల పురోగతిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేస్తామని, మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# నాణ్యమైన ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యం ఇవ్వాలి

## జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) వి.రాములు సూచించారు. మంగళవారం లక్షెట్టిపేట మండలం మిట్టపల్లిలోని శ్రీరామ, శివరామకృష్ణ రైస్ మిల్లులతో పాటు గుల్లకోటలోని శ్రీరామచంద్ర రైస్ మిల్లును జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు జాప్యం లేకుండా తరలించాలని, మిల్లుల నిర్వాహకులు కూడా వెంటనే స్వీకరించాలని సూచించారు. అనంతరం జన్నారం మండలంలోని పొన్కల్, రెండ్లగూడ, మొర్రిగూడ, దండేపల్లి





కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు తేమ లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలని అన్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని, కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, హస్క్ రిమూవర్లు వంటి సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జన్నారం వ్యవసాయ మార్కెట్ గోదామును పరిశీలించి, రాఘవేంద్ర రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండలాల తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు క్రీడా పోటీలు






**ఉద్యమ కెరటం, మందమర్రి:** మందమర్రి ఏరియాలోని సిఈఆర్ క్లబ్లో మంగళవారం వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగులకు 61వ వార్షిక క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్, సిఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం ఉద్యోగులకు క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, కళాకారులు కోల్ ఇండియా స్థాయిలో ప్రతిభ చాటుతూ సంస్థకు పేరు ప్రఖ్యాతలు తెస్తున్నారని అన్నారు. సీనియర్ క్రీడాకారులు యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, ఉద్యోగుల ఆరోగ్యం సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం కోల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు, కళాకారులను సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సిఎంఓఏ రమేష్, సిహెచ్ అశోక్, డీజీఎం పర్సనల్ ఎం.కార్తీక్, సీనియర్ పిఓడబ్ల్యుపిఎస్ అండ్ జీఏ శివ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శాఖ శ్రీను, జనరల్ కెప్టెన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏటి యాదవ్ జన్మదిన వేడుకలు




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఏటి యాదవ్ జన్మదిన వేడుకలు గంభీరావుపేట మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు దోమకొండ కృష్ణకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం మండల కమిటీ సభ్యులు స్థానిక అనాథ వృద్ధాశ్రమంలో ఈ వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఏటి యాదవ్ చేత కేక్ కట్ చేయించగా, అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వృద్ధులతో కలిసి జన్మదినాన్ని జరుపుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఏటి యాదవ్ తెలిపారు. తన జన్మదిన వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించిన గంభీరావుపేట యాదవ సంఘం మండల కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఒగ్గు బాలరాజు యాదవ్, ఆసరి బాలరాజు యాదవ్, మండల ఉపాధ్యక్షుడు ఎక్కల్ దేవి చంద్రం యాదవ్, మల్లా రెడ్డిపేట సర్పంచ్ చేకుటి మహేష్ యాదవ్, యాదవ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు

## బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కరీంనగర్లో పట్టపగలే తుపాకులతో కాల్పులు జరిపి జ్యువెల్లరీ దుకాణంలో దొంగతనం జరిగిన ఘటనపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. ఈ ఘటన జరిగినప్పటికీ రాష్ట్ర హోం మంత్రి కనీసం ఘటనాస్థలిని సందర్శించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రజల భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అలాగే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాసానికి సమీపంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ ఆయన బాధితులను పరామర్శించలేదని అన్నారు. రోజూ దేశం, ధర్మం గురించి మాట్లాడే నాయకులు ఇలాంటి ఘటనల సమయంలో స్పందించకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సేంద్రియ వ్యవసాయంపై దృష్టి



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామగోపాల వర్మ, శాస్త్రవేత్త డాక్టర్ శివచరణ్ అన్నారు. మండల పరిధిలోని తోషం గ్రామంలో మంగళవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో జరుగుతున్న మార్పులు, సాగు ఖర్చు తగ్గించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడవద్దని, యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని, పంట మార్పిడి పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధ్యమని తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని వివరించారు. అనంతరం వ్యవసాయ అధికారి భగత్ రమేష్, ఏఈఓ స్రవంతి సాగునీటి పొదుపు, సమీకృత వ్యవసాయ విధానాలు, రసాయనాల వినియోగం తగ్గించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతులు సతీష్, రాము, రైతులు పాల్గొన్నారు.

# విజయ్ దళపతి సీఎం ఎన్నికపై వేంసూర్లో సంబరాలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తమిళనాడులో విజయ్ దళపతి ముఖ్యమంత్రిగా ప్రజా తీర్పు రావడాన్ని ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూర్ మండల కేంద్రంలో దళిత నాయకులు ఆనందంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎంఎస్పీ జిల్లా నాయకుడు కలపాల యేసు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక యువత, నాయకులు పాల్గొని స్వీట్లు పంచుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యేసు మాట్లాడుతూ ప్రజల తీర్పు తమకు ఆనందదాయకమని, ఈ వేడుకలను నిర్వహించిన యువతను అభినందించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆకాంక్షించిన దళితుల సాధికారత దిశగా ఇది ఒక ముందడుగు అని, విజయ్ దళపతి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శ్రీను, కిన్నెర మణి, కొలికిపోగు నరేష్, భూపాల్, ఖమ్మంపాటి కిరణ్, కిన్నెర నాగరాజు, కంచర్ల రాధాకృష్ణ, కిన్నెర నగేష్, కంచర్ల అశోక్, కిన్నెర మారేష్ కుమార్, కొరికిపోవు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

